

సాక్షి బాపట్ల

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5360 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2962 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3533 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 990 క్యూసెక్కులు విడుదల చేశారు.


కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

పరమశివుడిని తాకిన సూర్యకిరణాలు



వేటపాలెం: నాయినపల్లిలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో పరమశివుడిని సూర్య కిరణాలు తాకాయి. ఆదివారం ఉదయం దాదాపు 15 నిమిషాల పాటు శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. దేవస్థాన ప్రధాన అర్చకుడు కారంచేటి చంద్రశేఖరావు మాట్లాడుతూ కార్తిక మాసం దక్షిణాయనం మార్గశిర మాసంలో దాదాపు 15 రోజుల పాటు ఉదయం 8.45 గంటలకు ప్రతి రోజు సూర్య కిరణాలు శివుడిపై పడతాయని తెలిపారు. మహా శివరాత్రికి ముందు సూర్యకిరణాలు పరమశివుడిని తాకడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శివాలయాన్ని 1100 ఏళ్ల కిందట చోళరాజులు నిర్మించారని తెలిపారు. శివాలయానికి బ్రహ్మసూత్రం అనే పేరు కూడా ఉందన్నారు. శివలింగంపై మూడు బాణాల గుర్తులు ఉండటం వల్ల దీన్ని బ్రహ్మసూత్రం అంటారని పేర్కొన్నారు. ఇటువంటి దేవస్థానాలు అరుదుగా ఉంటాయని తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో



చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఆదివారం చీరాలలో నిర్వహించారు. చీరాల డివిజన్‌లో ఎన్ఆర్‌పీఎం హైస్కూల్, ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్, మదర్ థెరిసా స్కూల్, కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు చీరాల డివిజన్‌లో 934 మంది హాజరుకావాల్సిఉండగా, 890 మంది హాజరయ్యారు. కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, బాపట్ల ఉప విద్యాశాఖాధికారి జి.వెంకటేశ్వర్లు, ఎంఈవో డి.నాగేశ్వరరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాటు రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందిస్తుంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 563.90 అడుగుల వద్ద ఉంది. ఇది 241.5368 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,040, ఎడమకాలువకు 8,280 ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20.440 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 20,440 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 837.60 అడుగుల వద్ద ఉంది. ఇది 58.3694 టీఎంసీలకు సమానం.

‘ఉపాధి’కి ఊతం

- జిల్లాలో ఊపందుకున్న ఉపాధి పనులు
- ప్రస్తుతం రోజుకు 37 వేల మందికి పనులు
- దీనిని 57 వేల మందికి పెంచేందుకు చర్యలు
- రాబోయే రెండు నెలల్లో లక్ష్యం మేరకు పనులు



ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. ఈ పథకం ద్వారా నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్నారు. వ్యవసాయానికి అనుగుణంగా ప్రభుత్వం ఉపాధి పనులు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం చెరువుల ఆధునికీకరణ, ఫీడర్, ఫీల్డ్ చానల్స్, డ్రెయిన్స్, రోడ్లకిరువైపుల మొక్కల పెంపకం, ఉద్యానవన పంటలకు సంబంధించి గుంతలు, అమృత్‌సరోవర్ పనులు, పంట కాలువలు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేపట్టారు. ఈ పనులు పూర్తయితే రైతుల పొలాలకు నీరు సక్రమంగా చేరి వ్యవసాయానికి అనువుగా ఉంటుంది. ఉద్యానవన పంటల సాగుకు అవసరమైన గుంతలను (ట్రెంచెస్) సైతం ప్రభుత్వమే ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేయడంతో ఇది రైతులకు మరింత ఉపయోగకరంగా ఉంటోంది. మరోవైపు రోడ్లకిరువైపులా మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతకు అవకాశం కలుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఏకకాలంలో అటు వ్యవసాయానికి ఇటు పర్యావరణానికి పెద్దపీట వేస్తోంది.

పేదలకు పెద్ద ఎత్తున ఉపాధి..

ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ప్రభుత్వం పనులు కల్పిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1.60 లక్షల జాబ్‌కార్డులకు సంబంధించి 2.80 లక్షల మంది పేదలకు పని కల్పించారు. రాబోయే మార్చి నెల నాటికి 74 లక్షల పనిదినాలు కల్పించాల్సిఉండగా ఇప్పటివరకు 59.53 లక్షల (88.44 శాతం) పని దినాలను కల్పించారు. ఇంకా 14.47 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉంది. ఇప్పటి వరకు కూలీలకు రూ.122 కోట్లు చెల్లించారు. మెటీరియల్ రూపంలో రూ.48.76 కోట్లు అందించారు. ఈ లెక్కన ఇప్పటివరకూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.170.69 కోట్లు చెల్లించారు. సగటున ఒక్కొక్కరికీ రోజు కూలి రూ 204.28 ఇచ్చారు. వాస్తవానికి రోజుకు రూ.257 చెల్లించాల్సిఉంది. పని తక్కువగా జరిగినందున కూలి తగ్గినట్లు తెలుస్తోంది. అయితే ఒక్కొక్కరికీ రూ.240కు తగ్గకుండా కూలి చెల్లించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో ఉపాధి హామీ అధికారులు ఆ మేరకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు నూరు పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలు 1304 ఉన్నాయి.



డ్రెయిన్ ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శంకర్ నాయక్ (ఫైల్)

జిల్లాలో 44 వేల పనులు..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 44 వేల పనులు చేపట్టారు. ఇప్పటి వరకూ 8,711 పనులు పూర్తయ్యాయి. మిగిలిన 35 వేల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తికావడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. రాబోయే రెండు నెలల్లో కనీసం 45 రోజులు పనిదినాలు అనుకున్నా రోజుకు 57 వేల మందికి పనులు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రోజుకు 37 వేల మందికి పైగా పనులు కల్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్యను మరింతగా పెంచి లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

385 గ్రామ పంచాయతీల్లో పనులు

జిల్లాలో 458 గ్రామ పంచాయతీలు ఉండగా 385 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను భాగస్వాములను చేసి పెద్ద ఎత్తున పనులు చేయిస్తున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పనులు చేయిస్తుండగా ఎంపీడీవోలు మండల స్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు. డ్వామా పీడీ శంకర్‌నాయక్ నిత్యం ఫీల్డ్‌కు వెళ్లి పనులు పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు వర్చువల్ విధానంలో క్షేత్రస్థాయి సిబ్బందిని అనుసంధానం చేసుకొని పనులు వేగవంతం చేయడమే కాకుండా అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు

జిల్లాలో 25 మండలాల పరిధిలో 3.18 లక్షల జాబ్ కార్డులు ఉండగా 5.88 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో రెగ్యులర్‌గా పనికి వచ్చే కుటుంబాలు (యాక్టివ్ జాబ్‌కార్డులు) 2,04,000 ఉండగా వాటి పరిధిలో 3,61,000 మంది కూలీలు ఉన్నారు.

లక్ష్యాల మేరకు ఉపాధి పనులు



జిల్లాలో 385 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయానికి సంబంధించిన పనులతో పాటు అన్నిరకాల పనులు చేస్తున్నాం. వచ్చే మార్చి నెల నాటికి 74 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. రాబోయే రోజుల్లో రోజుకు 57 వేల మందికి పనులు కల్పించనున్నాం. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 44 వేల పనులను పూర్తిచేస్తాం. నిత్యం పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నాం.

– శంకర్ నాయక్, పీడీ, డ్వామా

మంగళగిరి నరసింహునికి తెప్పోత్సవం

సీతానగరం ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి లక్ష్మీనరసింహస్వామికి మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా కృష్ణా నదిలో ఆదివారం అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో మంగళగిరి లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక వాహనంలో సీతానగరంలోని కోదండ రామ సమేత వీరాంజనేయస్వామి దేవస్థానానికి తీసుకువచ్చారు. సీతానగరంలో లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. సీతానగరం కోదండరామ సమేత వీరాంజనేస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించిన అనంతరం కృష్ణానది ఎగువ ప్రాంతంలోని పడవల రేవు వద్ద ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన పంటుకి నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేసి, మేళతాళాలు, బాణసంచా మధ్య పూజలు చేస్తూ కృష్ణానదిలో లక్ష్మీనరసింహస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రామ కోటిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభాచార్యులు, శ్రీనివాస దీక్షితులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఉదయభాను దంపతులు

వైభవం.. కల్యాణోత్సవం

పెనుగంచిప్రోలులో వేంచేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల ఆదివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంలో రాత్రి 8. 42 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరఫున కొల్లా రాజశేఖర్, అపర్ణ దంపతులు, స్వామి వారి వంశం తరఫున కాకాని రంజిత్‌కుమార్, నిశిత దంపతులు, ఆర్జేసీ రవీంద్రరావు, ఆలయ ఈఓ జీవీడీఎల్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, నందిగామ ఏసీపీ జి. నాగేశ్వరరెడ్డి దంపతులు కల్యాణ పీటలపై కూర్చోగా.. వేద పండితులు, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు పామమాంబ వంశీకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

– పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట)



కల్యాణానికి హాజరైన అశేష జనం

అ‘పూర్వ’ సమ్మేళనం

- నలభైఏళ్ల లా విభాగ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న వైనం
- ఏఎన్‌యూ లా విభాగానికి పూర్వ వైభవం తెద్దామని నిర్ణయం
- మధురానుభూతులు పంచుకున్న పూర్వ విద్యార్థులు
- అధ్యాపకుల బోధనలే ఉన్నతికి మార్గదర్శకమన్న పూర్వ విద్యార్థులు



లా పూర్వ విద్యార్థుల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, పక్కన హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ ప్రసాద్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లా విభాగ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో వైభవంగా జరిగింది. దేశ వ్యాప్తంగా న్యాయరంగంతో పాటు పలు రంగాల్లో స్థిరపడిన లా విభాగ పూర్వ విద్యార్థులందరూ సమావేశానికి హాజరయ్యారు. 1979లో లా విభాగం ప్రారంభమైనప్పటి నుంచి అన్ని బ్యాచ్‌లకు చెందిన 400 మందికిపైగా పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నాటి మధురానుభూతులను గుర్తుచేసుకున్నారు. సరదా సంఘటనలు కొందరు చెబితే, సమాజానికి, యూనివర్సిటీకి, విద్యార్థి లోకానికి పనికొచ్చే అంశాలపై తాము చేసిన పోరాటాలను మరికొందరు గుర్తుచేసుకున్నారు. అధ్యాపకులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఎంతో సంబరపడ్డారు.

సాంబారు కథతో నవ్వులే.. నవ్వులు..

విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూనివర్సిటీ సాంబారుకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. హాస్టల్‌లో సాంబారు తిని క్లాసుకు వచ్చి మత్తుగా నిద్రపోయేవారని, దాంతో కొద్దిసేపు క్లాస్ ఆపి టీ బ్రేక్ ఇస్తే, తరువాత మత్తు వదిలి అప్పుడు పాఠం వినేవారనిఎదురుగా కూర్చున్న పూర్వ విద్యార్థులను చూస్తూ అనడంతో అందరూ ఘల్లునానవ్వారు.

పాదాభివందనాలు, ఫొటోలు, సెల్ఫీలు..

సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ అధ్యాపకులకు పాదాభివందనాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి పూర్వ విద్యార్థులైన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, ఒక వీసీ, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్, మానవ హక్కుల కమిషన్ సభ్యులతో పాటు 20 మంది వరకు న్యాయమూర్తులు హాజరయ్యారు. వీరెవ్వరూ గురువులతో పాటు వేదికపై కూర్చోమని స్పష్టం చేశారు. ఎంత ఎదిగినా తాము గురువులకు శిష్యులమేనని వేదిక ముందే కూర్చుని గురువుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. గురువులతో ఫొటోలు, సెల్ఫీలు దిగి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించుకున్నారు.

లా కోర్సు ప్రారంభించాల్సిందే..

దేశంలోనే ఎంతో ప్రత్యేకత ఉన్న ఏఎన్‌యూ లా విభాగంలో నేడు లా కోర్సు లేకపోవడం విచారకరమని సమావేశంలో పాల్గొన్నవారందరూ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ, సమాజ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు దోహదం చేసే లా కోర్సును మళ్లీ ప్రారంభించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని స్పష్టం చేశారు. కోర్సు మళ్లీ ప్రారంభిస్తే వీలైనప్పుడు పాఠాలు చెప్పేందుకు తాము సిద్ధమని హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు అన్నారు. సమావేశంలో లా విభాగ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య వైఆర్ హరగోపాల్‌రెడ్డి, ఆచార్య ఎ.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎస్.రంగయ్య, ఆచార్య రాయప్ప, ఆచార్య హాస్కరరావు, ఆచార్య జయశ్రీ, పూర్వ విద్యార్థుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్, డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య వి.సూర్యప్రకాష్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, హైకోర్టు పీపీ నాగిరెడ్డి, ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాస్, 20 మందికిపైగా న్యాయాధికారులు పాల్గొన్నారు.

క్షీరసాగర మథనమే లక్ష్యం

- అమలులోకి నేషనల్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ పథకం
- జాతి పెయ్యల సంతతి వృద్ధి లక్ష్యం
- పాల ఉత్పత్తిని మరింత పెంచే దిశగా అడుగులు
- ప్రభుత్వ రాయితీపై రూ. 500కే ఇంజక్షన్లు
- జిల్లాలో 3853 పశువులకు అందజేత

మేలుజాతి రకం పశువుల సంతతి వృద్ధే లక్ష్యంగా, గ్రామాల్లో పెయ్యదూడల జననాలు పెరిగి క్షీరసాగర మథనం జరగడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళుతోంది. పశు పోషకులకు ఎంతో మేలు చేసేలా రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తోంది. ఖర్చుతో కూడుకున్న ఇంజక్షన్లను రాయితీపై అందిస్తూ అండగా నిలుస్తోంది. ఇప్పటికే ప్రతి ఇంటా క్షీర సిరులు పొంగే విధంగా గ్రామగ్రామన అవగాహన కల్పిస్తూ, ఈ పథకం అమలులో జిల్లా యంత్రాంగం శరవేగంగా ముందుకెళుతోంది.

బాపట్లటౌన్: గేదెలకు పెయ్య(పడ్డదూడ) లనే పుట్టించే ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వం పశుపోషకులకు అండగా నిలిచేందుకు సెక్స్ సార్టెడ్ సెమిన్ ఇంజక్షన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఇంజక్షన్ల వలన కేవలం గేదెలకు పెయ్యిదూడలు (పడ్డదూడలు) మాత్రమే పుట్టే అవకాశం ఉంది. ఈ విధానం వలన భవిష్యత్‌లో గేదెల సంతతితో పాటు పాల ఉత్పత్తి మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇదే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కొన్నాళ్ల క్రితం నేషనల్ ఆర్టిఫీషియల్ ఇన్‌సెమినేషన్ ప్రోగ్రామ్ పేరిట కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వివిధ జాతుల దున్నపోతుల నుంచి వీర్య కణాలను సేకరిస్తారు. వీటి నుంచి ఫిమేల్ సెల్స్‌ను వేరుచేసి మైనస్ 176 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద లిక్విడ్ నైట్రోజన్‌లో నిల్వ ఉంచుతారు. వీటిని సాధారణ రూమ్ టెంపరేచర్‌కు తీసుకొచ్చి ఎదకు వచ్చిన గేదెలకు ఇంజక్షన్ ద్వారా ఇస్తారు. ఈసెమన్ (వీర్యం) 40 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా నిల్వ ఉంటుంది. ఇలా అవసరమైన గేదెలకు ఈ వీర్యకణాల ఇంజెక్షన్ ఇస్తే 90 శాతం వరకు పెయ్యలే పుడతాయి. ఈ ఏడాది మార్చిలోపు జిల్లాలో 5 వేల పశువులకు పైగా సెక్స్ సార్టెడ్ సెమెన్‌ను ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. పాలను అధికంగా ఉత్పత్తిచేసే జెర్సీ, హాల్‌స్టయిన్ ఫ్రీజియన్ జాతులకు చెందిన ఫిమేల్ సెల్స్ సెమెన్‌ను పశు వైద్యశాలల్లో భద్రపరిచి ఉంచారు. జిల్లాలోని తీర ప్రాంతాల్లో గేదెలు అధికంగా ఉండటంతో రైతులు తమ పశువులకు ఈ ఇంజక్షన్ చేయించేందుకు ముందుకొస్తున్నారు.



పశువులకు ఇంజక్షన్లు చేస్తున్న పశువైద్యాధికారులు


రూ. 500 చెల్లిస్తే చాలు...

ఈ సెక్స్ సార్టెడ్ సెమెన్ ఇంజెక్షన్ ఒక్కడోస్ ఖరీదు రూ. 675, ఎదలో ఉన్న గేదెకు రెండు డోస్‌లు చేయాల్సి ఉంటుంది. మొత్తం రూ.1350 గానూ రైతు రూ. 500 చెల్లిస్తే మిగిలిన రూ. 850 మొత్తాన్ని సబ్సిడీ రూపంలో ప్రభుత్వమే భరిస్తుంది. ఎదకు వచ్చిన గేదెలను గుర్తించి సంబంధిత పశువైద్యులను సంప్రదిస్తే రెండు డోసులు చేస్తారు. ఒకవేళ ఇవి ఫెయిల్ అయితే ఇంజక్షన్ కు వెచ్చించిన సొమ్మును రైతుకు వెనక్కి ఇస్తారు. ముర్రా, సాహివాల్, గిరి, జెర్సీ, హాల్‌స్టెయిన్ ఫ్రీజియన్ జాతులకు చెందిన ఇంజక్షన్లను అధికారులు సిద్ధం చేశారు.

యుక్త వయస్సులోని గేదెలకే..

పెయ్యదూడలను పుట్టించే ఇంజక్షన్‌లను మూడు ఈతల లోపు గేదెలకు మాత్రమే చేస్తున్నారు. గేదె ఈనిన 90 రోజులలోపు ఎదకు వచ్చిన గేదెలకు మాత్రమే ఇంజక్షన్లు చేస్తున్నారు. ఈ ఇంజక్షన్లను కేంద్రప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) పథకం ద్వారా అందిస్తుంది. రైతులను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



సెక్స్ సార్టెడ్ సెమిన్ ఇంజక్షన్లపై సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనిని గేదెలకు ఇవ్వడం వల్ల పెయ్యలే(పడ్డదూడ) పుడతాయి. ఫలితంగా గేదెల సంతతి పెరిగి పాల ఉత్పత్తి అధికమవుతుంది. ఇంజక్షన్ అవసరమైన రైతులకు అందజేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 3853 గేదెలకు ఇంజక్షన్లను అందజేశాం. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని గేదెల సంతతిను పెంపొందించుకోవాలి.

– డాక్టర్ ఎం.హనుమంతరావు, జిల్లా పశువైద్యశాఖాధికారి

11 నుంచి జూడో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జూడో సబ్ జూనియర్, క్యాడెట్ రాష్ట్ర స్థాయి బాలబాలికల పోటీలను ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీ జూడో అసోసియేషన్ కార్యదర్శి నామిశెట్టి పవన్‌సందీప్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని మాంటిసోరి కాలేజీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జట్లు 11న ఉదయం 10 గంటల లోపు ఎంపిక ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

'ఫిష్ ఆంధ్ర'లో ఆధునిక చేపల దుకాణాల ఏర్పాటు

- జిల్లా మత్స్య అధికారి బాబు
- జిల్లాలో 232 ఏర్పాటుకు సన్నాహాలు
- కొనసాగిస్తున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ


చేపల విక్రేతలతో మాట్లాడుతున్న జిల్లా మత్స్య అధికారి బాబు

తెనాలి: ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా ఆధునిక చేపల అమ్మకం దుకాణాల ఏర్పాటుకు జిల్లాలో ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నట్టు జిల్లా మత్స్య అధికారి డాక్టర్ వీవీ ఆర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో మార్చి 31వ తేదీలోగా నాలుగు వేల దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి, జిల్లాకు 232 దుకాణాలు (మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు) లక్ష్యంగా నిర్ణయించిందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆదివారం జిల్లా మత్స్య అధికారి డాక్టర్ వీవీఆర్ బాబు, తన బృందంతో తెనాలి పర్యటించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట, మార్కెట్ సెంటర్, చెంచుపేట, చినరావూరు తోటలో చేపలు విక్రయిస్తున్న స్థానిక, స్థానికేతరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆధునిక దుకాణాలను ఏర్పరచుకుని ఆరోగ్యకరమైన, లాభదాయక వ్యాపారం చేయొచ్చని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ మున్సిపాలిటీలో చేపల అమ్మకం దుకాణాల ఏర్పాటుకు 47 స్థలాలను మున్సిపాలిటీ సూచించినట్టు తెలిపారు. ప్రతి మినీ యూనిట్ ఏర్పాటుకు 12 /10 అడుగుల దుకాణం అవసరమని డాక్టర్ బాబు చెప్పారు. అది సొంత షాపు లేదా అద్దెది అయివుండొచ్చని చెప్పారు. 120 చదరపు అడుగుల స్థలం ఉన్నట్టయితే కంటైనర్, షెడ్ రూపంలో దుకాణం నడుపుకోవచ్చని అన్నారు. షాపు యూనిట్ ధర గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష, చిన్న పట్టణాల్లో రూ.2 లక్షలు, నగరాల్లో రూ.3 లక్షలు అవుతుందని తెలిపారు. లబ్ధిదారు తన వాటాగా 10 శాతం చెల్లిస్తే, మిగిలిన మొత్తాన్ని సెక్యూరిటీ లేని రుణంగా బ్యాంకుల ద్వారా సమకూరుతుందని వివరించారు. మత్స్యశాఖ రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు సబ్సిడీని అందిస్తుందని చెప్పారు. షాపులు లేదా సొంత స్థలం లేనివారు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, మార్కెటింగ్, ఆర్టీసీ స్థలాల్ని లీజుకు ఇప్పిస్తామని తెలిపారు. తెనాలిలో ఎంపీడీవో, మెప్మా కార్యాలయంలో జరిగిన సమావేశాల్లో ఇప్పటికే 25 మంది లబ్ధిదారుల్ని గుర్తించినట్టు వివరించారు. వీరితో గుంటూరు మత్స్య అభివృద్ధి అధికారి జైనుల్లాఖాన్, గ్రామ మత్స్య సహాయకులు అనూష, శివపార్వతి, మున్సిపాలిటీ చైన్‌మెన్లు వెంకటరామయ్య, వీరయ్య, లక్ష్మీనారాయణ, స్థానిక మధ్యవ్యాపారి సురేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి హెచ్ఐవీ బాధితులకు హెపటైటిస్ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: ఏఆర్టీ సెంటర్స్‌లో పేర్లు నమోదు చేసుకుని, మందులు వాడుతున్న హెచ్ఐవీ బాధితులకు సోమవారం నుంచి హెపటైటిస్– బీ పరీక్షలు చేసి ఉచితంగా వ్యాక్సిన్లు వేయనున్నట్లు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ తెలిపారు. గుంటూరు జీజీహెచ్ ఏఆర్టీ సెంటర్, గోరంట్ల ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్, మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్, తెనాలి జిల్లా ఆస్పత్రి ఏఆర్టీ సెంటర్స్‌లో సుమారు 16వేల మందికి ఉచితంగా హెపటైటిస్– బీ వ్యాక్సిన్లు వేస్తామని పేర్కొన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పెప్ ఫార్, షేర్ ఇండియా సంస్థల సహకారంతో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు వివరించారు. హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ గ్రూపు సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్ జెండర్లు, వలసదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

కరెంట్ బిల్లు కట్టలేదని మెసేజ్ వచ్చిందా.. జాగ్రత్త..!

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: కరెంట్ బిల్లు కట్టలేదని వచ్చే మెసేజ్‌లపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కరెంటు బిల్లు కట్టలేదని అపరిచితుల నుంచి వచ్చిన మేసేజ్ లింక్‌లను క్లిక్ చేస్తే మీ ఖాతాలలో ఉన్న సొమ్ము ఖాళీ అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించినప్పటికీ, అమాయకులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, బ్యాంకింగ్ సర్వీసెస్‌పై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్లు మీ ఇంటి కరెంట్ బిల్లు చెల్లించలేదని మీ మొబైల్ మెసేజ్ పంపుతారు, వెంటనే చెల్లించకపోతే ఈ రోజు రాత్రి మీ ఇంటి కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామని, వివరాల కోసం కస్టమర్ కేర్ ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఈ మేజెస్‌లో ఉంటుందన్నారు. మెసేజ్‌లోని ఫోన్ నంబరుకు తిరిగి ఫోన్ చేసినట్లయితే సైబర్ మోసగాడు మిమ్మలినీ పరిచయం చేసుకుని 'మీ బిల్లు చెల్లింపు అప్‌డేట్ కాలేదని, వెంటనే ప్లే స్టోర్‌కు వెళ్లి లింకు డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లిస్తే అప్‌డేట్ అవుతుందని' నమ్మబలికి మీరు ప్లే స్టోర్‌కు వెళ్లి అతను చెప్పిన లింకు డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లించిన వెంటనే మీ బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము డెబిట్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని సూచించారు.



పోలీసులు విడుదల చేసిన అవగాహన పోస్టర్

సొసైటీలో అక్రమాలపై విచారణకు ఆదేశం

బాపట్ల టౌన్: దగ్గుమల్లివారిపాలెం ఆదిఆంధ్ర కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.వి.రామారావు ఆదేశించారు. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా సొసైటీకు చెందిన 10 ఎకరాల భూమిని హైవే అథారిటీ తీసుకొని నష్ట పరిహారం క్రింద సుమారు రూ.4 కోట్లు సొసైటీ ఖాతాలో జమచేశారు. జమచేసిన సొమ్మును సభ్యులకు అందజేయకుండా కొందరు వ్యక్తులు స్వాహా చేశారని సొసైటీ సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆడిట్ అధికారులు విచారించి నివేదిక జిల్లా కోఆపరేటివ్ అధికారికి అందజేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి కె.వి.రామారావు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణాధికారిగా కె.మాధవిను నియమిస్తూ 30 రోజుల్లోగా పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మేదరమెట్ల: కుటుంబ కలహాలతో గడ్డి మందుతాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొరిశపాడు మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం. వెంకటేశ్వరరావు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన పాణ్యం నాగ దుర్గారావు, భార్య కావేరి(22) వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లి జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తలు చిన్నచిన్న విషయాలకు తరచూ గొడవపడుతుండేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం గడ్డి మందు తాగింది. అత్త గమనించి మేదరమెట్లలోని ప్రైవేటు వైద్యశాలకు, అక్కడ నుంచి ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త దుర్గారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రోటావేటర్ మిషన్‌లో పడి బాలుడి మృతి

అద్దంకి రూరల్: గడ్డి కత్తిరించే రోటావేటర్ మిషన్‌లో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రోశయ్య తెలిపిన వివరాలు.. మండలంలోని వెంకటాపురానికి గ్రామానికి చెందిన మునగంటి వీరాచారి ఇంటికి సమీపంలో గడ్డిని యంత్రంతో కట్ చేస్తున్నారు. ఈక్రమంలో కుమారుడు మునగంటి అవేష్(12) ఆదివారం మిషన్‌కు వెనుక వైపు ఉన్న చక్రం పైభాగంలో బాలుడు అవేష్ కూర్చుని చూస్తున్నాడు. జారి పడ్డాడు. కాళ్లు, నడుము కట్ అవడంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు.

ఉద్యోగ సంఘ బైలా సవరణకు ఉత్తర్వులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ బైలా సవరణకు ప్రభుత్వం జీవో ఎం.ఎస్. నంబరు 17 ద్వారా ఈనెల 2న ఉత్తర్వులు విడుదల చేసినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సవరించిన బైలా ప్రకారం జిల్లా పరిషత్, మండల పరిషత్, జెడ్పీ హైస్కూల్స్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డివిజన్, సబ్ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్, టైపిస్ట్స్, స్టెనోగ్రాఫర్స్, రికార్డ్, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్స్ ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు. 1965లో గుర్తింపు పొందిన ఈ సంఘం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తోందని, సంఘ పటిష్టతకు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. బైలా సవరణకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

గుంటూరు జిల్లాలో 52,558 హెక్టార్లలో రబీ సాగు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 71,624 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 52,558 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గత అక్టోబర్ చివరి వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 1,082 హెక్టార్లు ఉండగా 510 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 22,077 హెక్టార్లకు గాను 8,941 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న సాధారణ సాగు 20,514 హెక్టార్లకు గాను 24,291 సాగు చేశారు. కంది 112 హెక్టార్లకు గాను 20 హెక్టార్లు సాగు చేశారు. మంచి శనగ 10,098 హెక్టార్లకు గాను 6,196, పెసర 10,323 హెక్టార్లకు గాను 7,766, మినుము 6,518 హెక్టార్లకు గాను 4,314, పొగాకు 754 హెక్టార్లకు గాను 520 హెక్టార్లలో రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు వివరించారు.


గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



మోతడక(తాడికొండ): గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం తాడికొండ మండలం మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. అసోసియేషన్ నూతన ప్రెసిడెంట్‌గా వి. వీరభద్రారెడ్డి, కార్యదర్శిగా సీహెచ్. పుల్లయ్య, ట్రెజరర్‌గా ఝాన్సీరాణి, చైర్మన్‌గా వై.వి.ఆంజనేయులు, చీఫ్ పాటర్న్‌గా కళ్ల మోహన్‌రెడ్డి, సీఈవోగా వద్రాణం మార్కండేయబాబు, కో–ఆర్డినేటర్‌గా దాసరి కోటేశ్వరరావు నియమితులయ్యారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ తరపున కాశీవిశ్వనాథరెడ్డి, శాప్ గుంటూరు కోచ్ నరసింహారావు, ఒలింపిక్ అసోసియేషన్ వెంకటేశ్వరరావు, జిల్లా ఖోఖో అసోసియేషన్ మాజీ కార్యదర్శి పి. రావుకిశోర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జె.ఎస్.సురేష్

నరసరావుపేట రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నరసరావుపేట ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎస్. సురేష్ అన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం గుంటూరు, ఎడ్యుకేట్ ది సొసైటీ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఇతర అంశాలలోని పోటీలను ఆదివారం ప్రారంభించారు. గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి కిరణ్మయిదేవిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలలోను కూడా రాణించినట్లయితే శారీరకంగా, మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ జె.ఎస్.సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సమానమని, ఓటమి గెలుపుకు నాంది అని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, రాజేంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణం ప్రారంభించాలి


ఎమ్మెల్యే సుచరితకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గుంటూరు రూరల్: నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా నిరుపయోగంగా ఉన్న అంబేడ్కర్ భవనం స్థానంలో ప్రభుత్వం చొరవ తీసుకుని నూతన నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు ఆదివారం భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవనం నిర్మించి శతాబ్దాలు గడిచినందున ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని, నూతన నిర్మాణాన్ని చేపట్టే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. నాయకులు నీలాంబరం, బాపట్ల ఏసుబాబు, నరసింహారావు, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, విల్సన్‌రాజు, పాల్గొన్నారు.

సొసైటీలో అక్రమాలపై విచారణకు ఆదేశం

బాపట్ల టౌన్: దగ్గుమల్లివారిపాలెం ఆదిఆంధ్ర కో ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.వి. రామారావు ఆదేశించారు. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా సొసైటీకు చెందిన 10 ఎకరాల భూమిని హైవే అథారిటీ తీసుకొని నష్టపరిహారం క్రింద సుమారు రూ.4 కోట్లు సొసైటీ ఖాతాలో జమచేశారు. జమచేసిన సొమ్మును సభ్యులకు అందజేయకుండా కొందరు వ్యక్తులు స్వాహా చేశారని సొసైటీ సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి కె.వి.రామారావు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణాధికారిగా కె.మాధవిను నియమిస్తూ 30 రోజుల్లోగా పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

సాహితీ వైభవం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి: సృజన సాహితీ సంఘం పుట్టుక నుంచి నేటి వరకు నిర్వహించిన కార్యక్రమాల సమాహారమే సాహితీ వైభవం పుస్తకం అని సాహితీవేత్త డీవీఎం సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని రామ సుశీల నిలయంలో సృజన ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజన సాహితీ వైభవ పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. పుస్తక ఆవిష్కరణ సభకు డీవీఎం సత్యనారాయణ పుస్తక సమీక్ష చేయగా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఇప్పగుంట మల్లికార్జునరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి రిటైర్డ్ ఆర్జేడీ యాదేవపాలన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సృజన నామనస పుత్రిక అన్నారు. 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సృజన సాహితీ సంస్థ దేశవ్యాప్త పేరు ప్రఖ్యాతులు పొందిదని చెప్పారు. గరికపాటి వంటి ఉద్దండ సాహితీవేత్తల నుంచి ఎందరో సాహితీవేత్తలను, రచయితలను వివిధ రంగాల వారిని సన్మానించి సత్కారాలు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. డీవీఎం పుస్తక సమీక్ష చేస్తూ సృజన 25 సంవత్సరాల్లో నిర్వహించిన కార్యాక్రమాలను, ఆ రోజు నిర్వహించిన విశేషాలను, పాల్గొన్న పెద్దలు, పురస్కారం పొందిన వారి గురించి కూలంకషంగా పుట్టంరాజు తన పుస్తకంలో దృశ్య రూపాలతో వివరించారని చెప్పారు. తొలుత సరస్వతి ప్రార్థన, సృజన గీతంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, గ్రంథ పాలకుడు సుగుణరావు, గాడేపల్లి దివాకరదత్తు, ఇలపావులూరి సాయి, కే అనీలకుమార సూరి, వారణాశి రఘురామశర్మ, ఓరుగంటి ప్రసాద్, చుండూరి మురళీ సుధాకరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, లక్కారాజు చంద్రశేఖర్, ధర్మవరపు సీతారామయ్య, కే రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పేట్రేగిపోతున్న పెత్తందార్ల ఆగడాలు

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

తెనాలి: రాష్ట్రంలో భూమాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని గాజుల్లంక, పెదలంక, చింతల్లంక గ్రామాల్లో ఇటీవల ఆర్సీ భూములు సాగుచేస్తున్న దళితులపై పెత్తందార్లు దాడి చేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు. ఆదివారం తెనాలి వచ్చిన శ్రీనివాసరావు, చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు సాగు చేసుకుంటున్న భూముల్ని పెత్తందారులు దౌర్జన్యంగా లాక్కుంటుంటే, వారికి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. దేవదాయ భూములు, అటవీ భూములు, గ్రామకంఠాలు, కాలువ కట్టలు, చెరువు గట్లు, అసైన్డ్ భూముల్లో దందాలు నడుస్తున్నాయని చెప్పారు. దాడికి పాల్పడినవారిపై తూతూమంత్రంగా కేసులు నమోదుచేసి, దాడికి గురైన పేదలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ హత్యాయత్నం చేసిన వారిపై 307, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు వారికే అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న తెలుగుదేశం, పేదల పక్షమని చెప్పుకుంటున్న జనసేనలు కనీసం స్పందించకపోవటం బాధాకరమని తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, బాపట్ల జిల్లా కన్వీనర్ శరత్, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలి స్థలం కబ్జా

- రౌడీషీటర్ దావు కోటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు
- విచారణ చేపట్టిన మంగళగిరి రూరల్ పోలీసులు

మంగళగిరి: రూ. కోటి పైగా విలువైన విశ్రాంత ఉపాధ్యాయురాలి స్థలాన్ని ఓ రౌడీషీటర్ కబ్జా చేసిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు దేవరపల్లి భాగ్యలక్ష్మి భర్త మల్లికార్జునరెడ్డి మరణానంతరం 2005లో మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం సర్వే నంబర్ 766/2లో 525 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి స్థలంలో ఎటువంటి నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో స్థానికంగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ దావు కోటేశ్వరరావు కన్ను పడింది. అనుకున్నదే తడవుగా స్థలాన్ని కబ్జా చేసి రేకుల షెడ్డు నివాసాన్ని నిర్మించడంతో పాటు చుట్టూ ఇనుప ఫెన్సింగ్ వేయించాడు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో స్థలాన్ని పరిశీలించేందుకు విశ్రాంత ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి సోదరి కుమారుడు వేణుగోపాలరెడ్డితో కలసి వచ్చారు. రేకుల షెడ్డుతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉండటంతో నిర్ఘాంత పోయింది. అదే సమయంలో కబ్జా చేసిన రౌడీషీటర్ దావు కోటేశ్వరరావు తన అనుచరులు కొందరితో అక్కడికి వచ్చాడు. స్థలం తనదేనని, తాను ఓ పెద్ద రౌడీషీటర్‌నని చెప్పి దాని జోలికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో విశ్రాంత ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మంగళగిరి రూరల్ పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. స్పందించిన రూరల్ పోలీసులు దావు కోటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్మికులందరికీ గుర్తింపు కార్డుల మంజూరు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కార్మిక శాఖ అధికారి సాంబశివారెడ్డి

మేడికొండూరు: రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి కళ్లం సాంబశివారెడ్డి తెలిపారు. ఇండియన్ లేబర్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతృత్వంలో పేరేచర్ల గ్రామ పరిధిలోని క్వారీల కూలీలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి సాంబశివారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలుగా జిల్లావ్యాప్తంగా ఉన్న వలస కార్మికుల్ని గుర్తించడంలో డీబీఆర్సీ జిల్లా ప్రతినిధులు విశేష కృషి చేశారని అభినందించారు. స్థానిక, వలస వచ్చిన కార్మికులనే వ్యత్యాసం లేకుండా అందరికీ వృత్తిరీత్యా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నామన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కార్మిక శాఖ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం యాజమాన్యాల నుంచి అందుతున్న వేతనాలపై కార్మికులతో చర్చించారు. పలువురు కార్మికులు సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకురావడంతో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. డీబీఆర్సీ ప్రోగ్రాం మేనేజర్ సామ్యూల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడికీ శ్రమకు తగిన కూలి అందేలా చూడడమే లక్ష్మమని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ లేబర్ హెల్ప్‌లైన్ ఫీల్డ్ మొబలైజర్ మిక్కిలి సురేష్‌బాబు పాల్గొన్నారు.

స్కూలు బస్సు సీజ్

నెహ్రూనగర్: స్కూలు బస్సుల్ని టూరిస్ట్ బస్సులుగా తిప్పితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం హెచ్చరించారు. ఓ విద్యా సంస్థకు చెందిన స్కూలు బస్సు పెళ్లికి కాంట్రాక్ట్ గ్యారేజ్‌గా మాట్లాడుకుని తిప్పుతుండగా ఆదివారం నగరంలో తనిఖీ చేపట్టి సీజ్ చేసినట్లు చెప్పారు. స్కూలు బస్సుల్ని విద్యార్థులను చేరవేయడానికి మాత్రమే వినియోగించాలని, టూరిస్ట్ బస్సులుగా తిప్పితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.